ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
శుక్రవారం 27 డిసెంబరు 2024

పది పరీక్ష ఫీజు చెల్లింపునకు 'తత్కాల్' అవకాశం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరం మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు తత్కాల్ కింద పరీక్ష రుసుం ఈ నెల 27 నుంచి వచ్చే నెల 10వ తేదీలోగా చెల్లించాలని డీఈవో శామ్యూల్ పాల్ గురువారం తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్ హోస్ట్ చేయబడిన ఎస్ఆర్ జనరేషన్ కోసం వారికి ఇప్పటికే ఇచ్చిన యూజర్ ఐడీ పాస్‌వర్డ్ ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలన్నారు.



2024.. పొలిటికల్ క్యాలెండర్‌లో ఈ సంవత్సరం వెరీ స్పెషల్. ముఖ్యంగా రాజకీయ పార్టీలను, ఎంపీ, ఎమ్మెల్యేల దశ..దిశ మార్చేసిన ఏడాది. ఓడలు బండ్లు.. బండ్లు ఓడలు అవుతాయన్న నానుడి ఈ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో నిజమైంది. రాజకీయ ప్రముఖులను సైతం మట్టి కరిపించిన ఎన్నికలు ఈ ఏడాదిలో జరిగాయి. పైగా మొదటి ఆరు నెలలు వైసీపీ ప్రభుత్వం పాలిస్తే... తర్వాతి ఆరు నెలలు టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి పాలన చేపట్టింది. మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ లేకుండా పోతే... టీడీపీ మాత్రం ప్రభంజనం సృష్టించింది. ఎన్నికల సందడితో మొదలైన ఈ ఏడాది కూటమి పార్టీలకు మధుర జ్ఞాపకాలు మిగిలిస్తే.. వైసీపీకి చేదు జ్ఞాపకాలు అందించింది. మొత్తం మీద 2024 సంవత్సరంలో కర్నూలు జిల్లాలో వివిధ పార్టీల అధినేతల పర్యటనలతో సందడిగా మారింది.

- 2024లో ఆర్నెల్లు వైసీపీ.. మరో ఆర్నెల్లు టీడీపీ
- రెండు ప్రభుత్వాల పాలన
- మేలో ఎన్నికలు... వైసీపీకి నిరాశ
- 40 ఏళ్ల తరువాత టీడీపీకి చారిత్రాత్మక విజయం
- వైసీపీకి కలలో కూడా ఊహించని దెబ్బ
- ఏడాదంతా 'రాజకీయ' సందడి
- కూటమికి రెండు ఎంపీలు, 12 అసెంబ్లీ స్థానాలు
- ఖాతా తెరిచిన బీజేపీ
- కందనవోలు ముంగిట 2024 రాజకీయ ముఖచిత్రం

చెరో సగం..!


జనవరి 9న నందికొట్కూరు ఎన్నికల సభలో చంద్రబాబు

కర్నూలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గేట్‌వే ఆఫ్ రాయలసీమగా పేరొందిన కర్నూలు రాజకీయాలు ఎప్పటికీ ప్రత్యేకంగా ఉంటాయి. 1983 ఎన్నికల్లో అప్పటి టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)కు ప్రజల్లో ఉన్న అఖండ అభిమానంతో భారీ విజయం అందుకుంది. ఆ తరువాత 40 ఏళ్లకు అంతకంటే భారీ విజయం పసుపు సైన్యానికి అందించిన సంవత్సరం ఇది. ఎట్టకేలకు ఆదోనిలో విజయం అందుకొని బీజేపీ ఖాతా తెరిచింది. ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలలో ఆయా పార్టీల అధినేతలు, కేంద్ర మంత్రులు పర్యటించారు. ఉమ్మడి జిల్లాల నుంచి టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల ఎంపీలు సహా ఏడుగురు ఎమ్మెల్యేలను తొలిసారిగా చట్టసభలకు పంపిన 2024 సంవత్సరానికి మరో ఐదు రోజుల్లో త్వరలో వీడ్కోలు పలకబోతున్నాం. 2025కు ఆహ్వానం పలికేందుకు సిద్ధమవుతున్న వేళ 2024లో ప్రధాన రాజకీయ పార్టీలు, ముఖ్య నాయకులకు మంచి అనుభవాలతో పాటు చేదు జ్ఞాపకాలు చవిచూశారు.



వైసీపీ చేదుజ్ఞాపకం

2019లో జరిగిన ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి క్లీన్‌స్వీప్ చేసిన వైసీపీకి 2024 కందనవోలు ముంగిట చేదు జ్ఞాపకమే మిగిలింది. కలలో కూడా ఊహించని ఘోర పరాజయం ఇచ్చి భారీ దెబ్బకొట్టింది. నంద్యాల జిల్లాలో అన్ని స్థానాల్లో ఓటమి చెందితే.. కర్నూలు జిల్లాలో ఆలూరు, మంత్రాలయం స్థానాలతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఆలూరులో కూడా స్వల్ప తేడాతో టీడీపీ ఓడిపోయింది. అందుకే రాబోయే ఏ ఎన్నికల్లో అయినా సరే వైసీపీకి గుర్తుండే ఏడాది ఇది.


ఫిబ్రవరి 15న కర్నూలుకు వచ్చిన అప్పటి సీఎం జగన్

అధినేతల పర్యటనలతో రాజకీయ సందడి

ఉమ్మడి జిల్లాలో ఆయా పార్టీల అధినేతల పర్యటనలతో 2024లో రాజకీయ సందడి సృష్టించారు. టీడీపీ అధినేత, నాటి ప్రతిపక్ష నేతగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా కోడుమూరు, మంత్రాలయం, పత్తికొండ, నంద్యాల, నందికొట్కూరు నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేశారు. అదే క్రమంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కూడా జిల్లాలో నిజం గెలవాలి పేరిట పర్యటించారు. యువగళం సారథి నారా లోకేశ్ నంద్యాల జిల్లాలో పర్యటించారు. బీజేపీ అగ్రనాయకుల్లో ఒకరైన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆదోని బహిరంగ సభలో పాల్గొన్నారు. గత ఏడాది యువనేత నారా లోకేశ్ 14 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తే 12 నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. వైసీపీ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి జగన్ సిద్ధం పేరిట జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. సిద్ధం సభలు పెట్టిన ఏ నియోజవర్గంలోనూ ఆ పార్టీ విజయం సాధించలేదు. అందుకే 2024 వైసీపీకి చేదుజ్ఞాపకాలను మిగిల్చింది.

40 ఏళ్ల తరువాత టీడీపీ అఖండ విజయం



ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కర్నూలు, నంద్యాల ఎంపీ స్థానాలు సహా 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 1983కు రెండు లోక్‌సభ స్థానాలతో పాటు 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 1982లో టీడీపీని స్థాపించిన నందమూరి తారక రామారావు 1983, 1985 ఎన్నికల్లో 13 అసెంబ్లీ స్థానాలకు గానూ 10-11 స్థానాల్లో గెలిపించారు. రెండు ఎంపీ సీట్లనూ టీడీపీ కైవసం చేసుకుంది. తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ టీడీపీ ఆ స్థాయిలో విజయం అందుకోలేదు. 40 ఏళ్ల తరువాత ఏ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో మరో చారిత్రాత్మక విజయం టీడీపీ సారథ్యంలో కూటమి అందుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం అందుకుంది. ఓటమి చెందిన రెండు నియోజకవర్గాల్లో ఆలూరులో కేవలం 2 వేల పైచిలుకు ఓట్ల తేడాతో చేజార్చుకుంది. టీడీపీ రాజకీయ చరిత్రలో లిఖించదగిన సంవత్సరం. అంతేకాదు.. కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరితో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలు టీజీ భరత్, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పార్థసారథి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బి.విరూపాక్షిలు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డిలు ప్రప్రథమంగా చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అదే క్రమంలో స్వాతంత్ర్యం తరువాత బీజేపీ ఉమ్మడి జిల్లాలో ఖాతా తెరిచింది. ఆ పార్టీ టికెట్‌పై విజయం సాధించిన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విజయం సాధించారు.

2024 రాజకీయ చిత్రాలెన్నో

- నంద్యాలలో 2023 సెప్టెంబరు 8న టీడీపీ అధినేత చంద్రబాబును నాటి జగన్ ప్రభుత్వం అరెస్టు చేసింది. 2024 ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో వైసీపీకి ఒక్క స్థానం కూడా ఇవ్వకుండా క్లీన్‌స్వీప్ విజయం టీడీపీ అదించారు.
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో ప్రజా వేదిక సభలో పాల్గొన్నారు. కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లు ఆయా జిల్లాల్లో పర్యటించి ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో సమీక్షలు నిర్వహించారు.
- స్వాతంత్ర్యం తరువాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీజేపీ అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పలు ఎన్నికల్లో పోటీ చేసినా.. ఒక్కసారి కూడా గెలవలేదు. తొలిసారిగా ఆ పార్టీ ఆదోని నుంచి విజయం సాధించింది.
- జిల్లాలో ఏడాదిలో టీడీపీ అధ్యక్షులుగా బీటీ నాయుడు, పి. తిక్కారెడ్డి బాధ్యతలు చేపట్టారు
- ఎన్నికల ఏడాదిలో కూడా ప్రజా సమస్యలపై సీపీఐ, సీపీఎం సహా వామపక్ష పార్టీలు పలు ఉద్యమాలను కొనసాగించారు.
- కర్నూలు ఎంపీగా నాలుగైదు పర్యాయాలు విజయం సాధించి, కేంద్ర మంత్రిగా పని చేసిన కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి డోన్ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు.
- ఉమ్మడి జిల్లాలో మూడు దశల్లో సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా డబ్ల్యూయూఏ, డీసీ, ప్రాజెక్టు ఎన్నికల్లో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ విజయం సాధించడం విశేషం.
- ఉద్యోగానికి రాజీనామా చేసి కర్నూలు అసెంబ్లీ నియోజకర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగిన ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ ఘోరంగా ఓటమి చెందారు. ఆ తరువాత నియోజకవర్గం వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడుతున్నందున కర్నూలు జిల్లాలో శుక్రవారం తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని రైతులు వ్యవసాయానికి సంబంధించి పంట కోతలు తదితర విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ చార్జీలపై నేడు వైసీపీ నిరసన ర్యాలీ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారానికి నిరసనగా శుక్రవారం వైసీపీ అధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉదయం 10 గంటలకు ఎస్టీబీసీ కళాశాల నుంచి కేవీఆర్ కళాశాల వద్ద విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గిడ్డయ్య
- ఘనంగా సీపీఐ శత వసంత వేడుకలు


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత వసంత వేడుకలు జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ముఖ్య అతిథిగా హాజరై ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న సీపీఐ ఆవిర్భవించిందన్నారు. జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించడంతో పాటు హైదరాబాద్, మణిపూర్ సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. మతం పేరుతో బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ ఓట్లు కొల్లగొట్టి అధికారం చేపట్టిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా రాజాభరణాల రద్దు కోసం, బ్యాంకులను జాతీయం చేయడంలో సీపీఐ వీరోచిత పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వ బ్యాంకులను విలీనం పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా కట్టబెడుతూ సామాన్య ప్రజలకు బ్యాంకులను దూరం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, మహిళా సమాఖ్య నాయకులు లలితమ్మ, శ్రావణి, భారతి, నగర సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, సి.మహేష్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో
నైపుణ్య రథం
శస్త్ర చికిత్సలు, బేసిక్ సర్జికల్‌పై శిక్షణ
కర్నూలుకు వచ్చిన జాన్సన్ అండ్ జాన్సన్ బస్సు
7
కౌలు రైతు ఆత్మహత్య
2

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



కర్నూలు క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. గురువారం డీఐజీ మాట్లాడుతూ ఏ బ్యాంకు వారు కూడా బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు అడగరన్నారు. తెలియని వ్యక్తులు ఎవరైనా అడిగినా కూడా చెప్పకూడదన్నారు. వాట్సాప్‌లో తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, డిజిటల్ అరెస్టులు అనేవీ ఏమీ లేవని తెలిపారు. అవన్నీ సైబర్ నేరస్థులు చేసే మోసాలని వివరించారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో డబ్బులు రెట్టింపు అవుతాయనే సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. నకిలీ లోన్ యాప్స్‌లో రుణాలు తీసుకోకూడదని సూచించారు. సులభంగా లోన్ పొందవచ్చని, సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపుతారనీ, ఫోన్లు చేస్తారన్నారు. అలాగే వెరిఫికేషన్ లేకుండా, ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే లోన్ ఇస్తామంటే అనుమానించాలని హెచ్చరించారు. తక్కువ మొత్తంలో రుణాలు ఇచ్చి భారీ మొత్తం తిరిగి చెల్లించాలని సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో, బంధువులు, స్నేహితులకు పంపుతామంటూ సైబర్ నేరగాళ్లు బెదిరిస్తారన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే బాధితులు వెంటనే డయల్ 1930కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని డీఐజీ సూచించారు.

ఉద్యాన పంటల సాగుకు చర్యలు తీసుకోండి: కలెక్టర్


ఉద్యాన పంటల సాగును పరిశీలిస్తున్న కలెక్టర్

గూడూరు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మల్లె, జామ, బత్తాయి, మునగ లాంటి ఉద్యాన పంటల సాగు మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం గూడూరు మండలంలోని కె నాగలాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం - హార్టికల్చర్ ప్లాంటేషన్ కార్యక్రమం కింద చేపట్టిన మల్లె, జామ తోటలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ నగరానికి దగ్గర్లో ఉన్న గ్రామాల్లో రైతులతో కనీసం వంద ఎకరాలలో మల్లె సాగు చేయించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించారు. బత్తాయి, మామిడి, జామలాంటి పండ్ల, తోటలు పెంపకం చేపట్టేలా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. మల్లె, జామ తోటల రైతులు పండిస్తున్న శ్రీనివాసులు, సుంకన్న రైతులతో కలెక్టర్ మాట్లాడి సాగు, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కోడుమూరు - ఎమ్మిగనూరు రోడ్డు మరమత్తు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. అలాగే కె నాగలాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, పంచాయతీ రాజ్ ఈఈ మద్దన్న, డీపీవో భాస్కర్, గూడూరు తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివ నాగప్రసాద్ పాల్గొన్నారు.

గోదాములను అందుబాటులోకి తీసుకరండి

మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత


పూర్తయిన గోదాములను పరిశీలిస్తున్న డైరెక్టర్ విజయ సునీత

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదాములను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరుతో పాటు నంద్యాల జిల్లాలో వివిధ గ్రామాల్లో నిర్మించిన గోదాములను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలో నాబార్డు రుణ సౌకర్యంతో గ్రామాల్లో గోదాములను నిర్మిస్తోందన్నారు. అసంపూర్తిగా ఉన్న గోదాముల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డీఈఈలు సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంలు నారాయణమూర్తి, రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు ఊరట..

మద్దతు ధర లభించకుంటే లోటు చెల్లించడానికి కేంద్రం పునరాలోచన

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు క్వింటం పత్తిని అమ్మితే సీసీఐ రూ.7521 ఇవ్వాలి. అయితే వివిధ కారణాల వల్ల ఆ ధరను పత్తి రైతులకు ఇవ్వడం లేదు. వ్యాపారులకు అమ్మిన సమయంలో క్వింటానికి రూ.6వేల నుంచి రూ.7వేల దాకా మాత్రమే పొందుతున్నారు. రైతులు నష్టపోకుండా పూర్తి స్థాయిలో మద్దతు ధర ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉల్లికి క్వింటానికి రూ.770 మద్దతు ధరను నిర్ణయించారు. ఈ ధర కంటే తక్కువ మొత్తాన్ని వ్యాపారులకు ఇవ్వగా .. లోటు మొత్తాన్ని ప్రభుత్వం బోనస్‌గా రైతులకు చెల్లించింది. ఈ విధానాన్ని పత్తి రైతుల విషయంలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నీతి అయోగ్ ఢిల్లీలో సమావేశమై పత్తి రైతులకు నష్టం రాకుండా కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు ధరను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిఫారసులు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

- ధర లోటు చెల్లింపు (పీడీపీ-ప్రైస్ డెఫిసిట్ పేమెంట్)గా పిలిచే ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్రంలో సన్నధాన్యం పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటానికి రూ.500 ప్రకారం బోనస్‌ను చెల్లిస్తుంది. ఇదే మాదిరిగా పత్తి రైతులకు ఊరట కలిగించేందుకు కేంద్రం పీడీపీ విధానంపై కసరత్తు చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. పత్తి ధరల్లో నెలకొన్న అనిశ్చితి నుంచి రైతులకు ఊరట కలిగించేందుకు గిట్టుబాటు ధర అందని సమయంలో దీనిని అమలు చేసే దిశగా కేంద్రం చర్యలు చేపట్టనుందని, గత నాలుగైదు నెలలుగా రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటూ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపారులు నిర్ణయించిన ధరకు సీసీఐ మద్దతు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కేంద్రమే భరించేలా త్వరలోనే ప్రకటన వెలువడనుంది. ఈ నెల 18న ఢిల్లీలో నీతి అయోగ్ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి ప్రయోగాత్మకంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణమూర్తి తెలిపారు.

వచ్చే ఏడాది నుంచి ఈ ప్రయోజనం

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6లక్షల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల తరపున దాదాపు 48 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు అంచనా వేశాయి. ఇప్పటికే రైతులు 70 శాతం దాకా పత్తిని దళారులకు విక్రయించారు. సీసీఐ కేవలం 4 లక్షల క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేసింది. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి అమలయ్యే బోనస్ అందజేత కార్యక్రమం వల్ల రైతులు ఎంతో ప్రయోజనం పొందే అవకాశం ఉంది.



ఆదోని పట్టణంలోని అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమస్యలు వేధిస్తున్నాయి. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 420 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంత మందికి కేవలం ఆరు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఇందులో హెచ్‌ఎం గది, స్టాఫ్ రూమ్‌తోపాటు మధ్యాహ్న భోజన పథకం సామగ్రి కోసం ఒక గదిని కేటాయించారు. మిగతా గదులు విద్యార్థులకు చాలకపోవడంతో ఆరుబయట చెట్ల కింద, వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదులు చాలకపోవడంతో పక్కనే అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులను కూర్చోబెడుతున్నారు.



ఆరో తరగతి తరగతిగదిలో ఇరుకుగా కూర్చున్న విద్యార్థులు

ఆరు గదుల్లో 420 మంది విద్యార్థులు

- ఆరు బయట, వరండాలో తరగతులు
- అప్‌గ్రేడ్ చేసి వదిలేశారు
- గదులు లేక అవస్థలు
- అమరావతి ఉన్నత పాఠశాలలో సమస్యలు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 2023-24 విద్యా సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. అమరావతి నగర్ శివారు ప్రాంతం కావడంతో విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌కు లేదా ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలకు వెళ్లే సమస్య తీరిందని విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషపడ్డారు. ఈ ప్రాంతవాసులతోపాటు పక్కనే ఉన్న బసాపురం, పర్వతాపురం, మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న ఏరియా విద్యార్థులు కూడా పాఠశాలలో చేరారు. ఈ ఏడాది 420 మంది విద్యార్థులు ఉన్నారు. ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. విద్యాశాఖ అధికారులు అప్‌గ్రేడ్ చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఉపాధ్యాయులను కేటాయించలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారు.



వరండాలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ఆరో తరగతిలోనే 130 మంది..

ఆరో తరగతిలోనే 130 మంది విద్యార్థులు ఉన్నారు. ఇరుకు గది కావడంతో విద్యార్థులు కిక్కిరిసి కూచుంటున్నారు. పుస్తకాల బ్యాగులతో కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందిపడుతున్నారు. అదనంగా మరో 12అదనపు గదులు నిర్మిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందని, వాళ్లందరినీ ఎక్కడ కూర్చోబెట్టాలో తెలియడం లేదని టీచర్లు ఆందోళన పడుతున్నారు.

నాడు-నేడు పునాదులకే పరిమితం..

గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందట నాడు- నేడు కింద రెండు అదనపు తరగతి గదులను మంజూరు చేసింది. అందుకు రూ.24 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఉపాధ్యాయులు పునాదులు తవ్వి పనులు ప్రారంభించారు. నిధులు విడుదల చేయకపోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిపేశారు.



ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

అదనపు తరగతి గదులు నిర్మించాలి



అమరావతి నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థ పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి కూడా విద్యార్థులకు స్థలం లేదు. ఒక్కో తరగతి గదిలో 100మందికి పైగా కూచోబెట్టి 2తరగతులకు పాఠాలు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే అదనపు తరగతి గదులను నిర్మాణానికి నిధులు కేటాయించాలి. లేనిపక్షంలో ఆందోళన చేస్తాం.

-శ్రీనివాసులు
ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆదోని

త్వరలో పనులు పూర్తి చేస్తాం



గత ప్రభుత్వం నాడు-నేడు కింద రెండు అదనపు తరగతి గదులను మంజూరు చేసింది. అయితే పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. మరో కొన్ని అదనపు తరగతులు విలీనం కావడం వల్ల సమస్య తలెత్తింది.

-శ్రీనివాసులు ఎంఈవో-2 ఆదోని



వైసీపీ ప్రభుత్వంలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం జోరుగా సాగింది. ఆ దందా ఇప్పటికీ జరుగుతోంది. మాజీ మంత్రి బుగ్గన బంధువుల గోడౌన్లలో ఈ వ్యవహారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ వ్యాపారాన్ని పూర్తిగా అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. మొన్నటి వరకు కింది స్థాయి డీలర్లు, ఎండీయూల ద్వారానే ఈ వ్యాపారం జరుగుతోందని అందరూ భావించేవారు. అసలు పీడీఎస్ బియ్యం ఏకంగా బఫర్ గోడౌన్ల నుంచే పక్కదారి పడుతోందని తెలుస్తోంది. ఇందుకు తగ్గట్టే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బఫర్ గోడౌన్ల నిర్వాహకులే దొరికిపోవడం గమనార్హం. అలాగే జిల్లాలోని బేతంచర్లలోని ఒక ఎస్‌డబ్ల్యూఎస్ గోడౌన్, మరో ప్రైవేటు గోడౌన్‌లో దాదాపు 1300 బస్తాలు మాయమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రైవేటు గోడౌన్ నిర్వాహకుల్లో ఒకరు మాజీ మంత్రి బుగ్గన బంధువు కాగా, మరో వ్యక్తి ఆయనకు చాలా సన్నిహితుడని తెలుస్తోంది.

పేదల బియ్యానికి రెక్కలు...!

తనిఖీ నిర్వహిస్తున్న సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు



- బుగ్గన బంధువుల గోడౌన్లలో బియ్యం మాయం
- బేతంచర్లలో తనిఖీ చేసిన సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు
- ఓ గోడౌన్‌లో 398 బస్తాలు తక్కువ చూపుతున్న రికార్డులు
- పత్తా లేకుండా పోయిన మరో ప్రైవేటు గోడౌన్ యజమాని

నంద్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఎక్కువగా రేషన్ బియ్యం దందా జరిగింది. ఇందులో ఎవరి వాటా వారికి వెళుతుండటంతో కేసులు నమోదు అయ్యేవి కావు. బియ్యం అక్రమం రవాణా బొత్తిగా జరగటం లేదంటే అనుమానం వస్తుందని అధికారులు అప్పుడప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తూ ఉండేవారు. అధికారులు చిరు వ్యాపారులు, డీలర్లు, ఎండీయూ వాహనదారుల మీదే కేసులు నమోదు చేస్తూ ఉంటే అక్రమ దందాకు మూలం ఇక్కడే ఉందని అందరూ భావించేవారు. అసలు కేసుల్లో ఇరుక్కునే వారంతా చిన్న చేపలని, పెద్ద చేపలు వేరే ఉన్నాయన్న అనుమానాలు వచ్చినా వారు ఎవరనేది తెలిసేది కాదు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ దందా మూలాలు బైటపడుతున్నాయి. బియ్యం దందా ఏకంగా ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించే బఫర్ గోడౌన్ల నుంచే జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇది ఎట్లా జరుగుతున్నదీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు తనఖీల్లో బయటపడుతున్నాయి. బేతంచర్లలో ఎస్‌డబ్ల్యూఎస్ గోడౌన్ ఒకటి ఉండగా, మరోటి ప్రైవేటు గోడౌన్ ఉంది. ఎస్‌డబ్ల్యూఎస్ గోడౌన్‌లో 398 బియ్యం బస్తాలు కనిపించకుండా పోగా, ప్రైవేటు గోడౌన్‌లో దాదాపు 920 బస్తాలు కనిపించటం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అయిన వారికి లబ్ధి చేకూర్చడానికేనా..?

ప్రస్తుతం బేతంచర్లలో ఉన్న రెండు బఫర్ గోడౌన్లు గతంలో ఉండేవి కావు. డోన్‌కు కర్నూలు నుంచి, ప్యాపిలికి గుంతకల్లు నుంచి, బేతంచర్ల, బనగానపల్లెకు నంద్యాల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు పీడీఎస్ బియ్యం సరఫరా అయ్యేది. అక్కడి నుంచి డీలర్లకు సరఫరా అయ్యేది. వైసీపీ అధికారంలోనికి వచ్చి బుగ్గన మంత్రి అయిన తర్వాత తన వారికి లబ్ధి చేకూర్చేందుకు బేతంచర్లలో బఫర్ గోడౌన్ల ఏర్పాటు చేయదలిచాడు. తన అనుయాయులకు చెందిన ఓ గోడౌన్‌ను ఎస్‌డబ్ల్యూఎస్ లీజుకు తీసుకునేలా, మరోటి తన బంధువొకరు, సన్నిహితుడొకరు కలిసి ప్రైవేటుగా నిర్వహించుకునేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ గోడౌన్లలో బియ్యం మాయమయ్యాయన్న అనుమానంతో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ తనిఖీలు చేపట్టింది. ఎస్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన దానిలో ఎంత మాయమైందనే దానిపైన ఓ స్పష్టత వచ్చింది. ఇక బుగ్గన బంధువులకు సంబంధించిన గోడౌన్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లగా సంబంధిత యజమానులు, మేనేజర్ అందుబాటులో లేకుండా పోయారు. ముందస్తు సమాచారం ఉండటంతోనే వారు జాడ లేకుండా పోయారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం బియ్యం పక్కదారి పట్టిందన్న రూఢి సమాచారం తమ వద్ద ఉందని సివిల్ సప్లైస్ డైరెక్టర్ చెబుతున్నారు. ఇక్కడ కనిపించకుండా పోయిన బియ్యం ఇటీవలదేనని, అసలు గత ఐదేళ్లలో భారీగా పేదలకు అందాల్సిన బియ్యం అక్రమంగా బయటకు పోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవాలు నిగ్గుతేలిస్తే ఏ స్థాయిలో బియ్యం అక్రమార్కుల పాలైందీ తెలిసే అవకాశం ఉంది.

అధికారులకు తెలిసే జరుగుతోందా..?

వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల చెప్పినట్లు అధికారులు విన్నారు. అదే బంధం ఇప్పటికీ కొనసా గుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్టు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఊతమిస్తున్నాయి. సాధారణంగా జిల్లా సివిల్ సప్లైస్ డీఎంకు ఏ బఫర్ గోదాముల్లో, ఏ ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎంత సరుకు ఉందనే విషయం తెలుస్తుంది. ప్రతి నెలా చేసి ఫిజికల్ వెరిఫికేషన్ బోర్డు నిర్వహిస్తుంటారు. అలాగే గోడౌన్ల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు వెళ్లే మూమెంట్ రిజిస్టరు, ఆ తర్వాత గోడౌన్‌లో ఎంత మిగిలిందని తెలిపే క్లోజింగ్ బ్యాలెన్స్ వివరాలు అన్నీ డీఎంకు ఎప్పటికప్పుడు చేరుతుంది. గోడౌన్లను తనిఖీ చేసేందుకు వెళ్లిన సివిల్ సప్లైస్ డైరెక్టర్ ఈ వివరాలను అడగ్గా డీఎం రాజునాయక్ సంబంధిత వివరాలు ఇంకా తనకు చేరలేదని సమాధానమిస్తున్నట్లు తెలుస్తోంది. వివరాలన్నీ బయటపడితే అసలు విషయం తెలిసిపోతుందని, అందుకే డీఎం జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ప్రైవేటు గోడౌన్‌లో కనిపించకుండా పోయిన బియ్యం బస్తాలకు సమానమైన మొత్తంలో బియ్యం బస్తాలను అధికారులు వేరే చోటు నుంచి తీసుకువచ్చి గోడౌన్‌కు చేర్చారని, ఎలాంటి అక్రమాలు జరగలేదని, అంతా సవ్యంగా ఉందని చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బియ్యం అక్రమ తరలింపు వ్యవహారం అంతా అధికారులకు తెలిసే జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవినీతి అంతా కక్కిస్తాం



రెండ్రోజుల కిందట బేతంచర్లలోని బఫర్ గోడౌన్లలో తనఖీలు నిర్వహించాం. ఎస్‌డబ్ల్యూఎస్ గోడౌన్‌లో 398 బియ్యం బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించాం. అలాగే ఇక్కడే ఉన్న మరో ప్రైవేటు గోడౌన్‌ను తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా, యజమానులు, మేనేజర్ అందుబాటులో లేకుండా పోయారు. ఈ ప్రైవేటు గోడౌన్‌లో 900కి పైగా బియ్యం బస్తాలు మాయమైనట్లు అనుమానాలున్నాయి. గోడౌన్లకు సంబంధించిన రికార్డులను ఇవ్వటంలో సివిల్ సప్లైస్ డీఎం రాజు నాయక్ జాప్యం చేస్తున్నారు. వివరాలు అన్నీ తీసుకుని ఎంత అవినీతి జరిగిందనేది వెలికి తీస్తాం. అంతేకాకుండా, గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలను కూడా బయటకు లాగుతాం. పేదల బియ్యాన్ని బొక్కిన వారిపై పీడీ యాక్టు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం. సహకరించిన అధికారులను కూడా వదిలిపెట్టే ప్రసక్తి లేదు.

- తలముడిపి మహేశ్ నాయుడు, ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్

వ్యవహారం రూ. కోట్లలో ఉందా..?

బఫర్ గోడౌన్లలో ప్రస్తుతం కనిపించకుండా పోయిన బియ్యం విలువ దాదాపు రూ.50 లక్షలు ఉంటుందని అంచనా! కేవలం బయటపడిన వాటి విలువే ఇంత ఉంటే.. గత ఐదేళ్లలో కోట్ల రూపాయల వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా సాగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం పేదలకు అదనంగా ఇచ్చిన బియ్యాన్ని వారికి చేరకుండా సరిహద్దులు దాటించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్థాయిలో బియ్యం పక్కదారి పట్టినా వైసీపీ నాయకుల అండదండలు ఉన్న వారికి అధికారులు వత్తాసు పలికి ప్రేక్షక పాత్ర పోషించారన్న ఆరోపణలు లేకపోలేదు. అందుకే గత ఐదేళ్ల రికార్డులన్నీ పరిశీలిస్తే అసలు ఎంత బియ్యం పేదలకు అందకుండా పోయిందీ.. ఎన్ని కోట్ల రూపాయలు వైసీపీ నాయకుల జేబుల్లోనికి వెళ్లిందీ.. తెలుస్తుందనే అభిప్రాయం ఉంది. అట్లాగే వారికి సహకరించిన అధికారులు భాగోతం బయటపడే అవకాశం ఉంది. ప్రస్తుత మాయమైన బియ్యం వరకే కూటమి ప్రభుత్వం పరిమితం కాకుండా లోతుగా ఆరా తీసి మొత్తం అవినీతిని వెలికితీయాల్సి ఉంది.

వికసిత్ భారత్-3కి ఉర్దూ వర్శిటీ విద్యార్థిని ఎంపిక

కర్నూలు అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ ఫెస్టివల్ -2025 ను పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ అనే అంశంపై నిర్వహించిన ఫేస్-2 రచన పోటీల్లో వర్శిటికి చెందిన ముల్లా జాస్మిన్ జహన్ ప్రతిభ కనపరిచింది. ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన ఫేస్-3 పోటీలకు ఎంపికైంది. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 250 మంది విద్యా ర్థులను ఉన్నత విద్యామండలి ఫేస్-3 దశకు ఎంపిక చేసింది. ఈనెల 30న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరిగే ఫేస్-3 పోటీల్లో మహిళా సాధికారత, సామాజిక సూచికలు అనే అంశంపై ఈ విద్యార్థిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. ఈ మేరకు గురువారం వర్శిటీలో ఉపకులపతి పిఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ లోక్‌నాథ్ విద్యార్థిని ముల్లా జస్మిన్‌ను అభినందించారు.

ప్రైవేటు ల్యాబ్‌లకు పంపితే చర్యలు

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు



తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోగులను వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లకు పంపించే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ఆయన చిన్న పిల్లలు గైనిక్, మెడికల్, ఏఎంసీ వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల కేషీట్లను పరిశీలించి అవుట్‌సైడ్ ల్యాబ్ పరీక్షలపై ఆరా తీశారు. ల్యాబ్ టెస్టుల కోసం ప్రైవేటు ల్యాబ్‌ల సిబ్బంది ఆసుపత్రి ఆదరణలోనికి రాకుండా సెక్యూరిటీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొందరు సెక్యూరిటీ గార్డులు ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులతో అనుకూలంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని టెస్టులు అందుబాటులో ఉన్నాయని, ఒక్క ఈఎస్ఆర్ మాత్రం కిట్ల కొరతతో చేయడం లేదని, రెండు మూడు రోజుల్లో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పరీక్షల కోసం రోగులను వైద్యులు న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌కు పంపించాలని ఆదేశించారు.

'పాటల చక్రవర్తి మహమ్మద్ రఫీ'



నివాళి అర్పిస్తున్న కళాకారులు, గాయకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హిందీ పాటల చక్రవర్తిగా, అమర గాయకుడు మహమ్మద్ రఫీ శ్రోతల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని పలువురు గాయకులు, కళాకారులు కొనియాడారు. హిందీ చలన చిత్ర నేపథ్య గాయకుడు, దివంగత మహమ్మద్ రఫీ శత జయంతిని టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహ్మద్‌మియా, సీనియర్ గాయకులు ఇబ్రహీంలు రఫీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, కె బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెస్సు లక్ష్యాన్ని సాధిస్తాం: ఏడీఎం



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ఏడు మార్కెట్ కమిటీల ద్వారా ఈ సంవత్సరం రూ.36.14 కోట్ల సెస్సును రాబట్టాలనే లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఇచ్చారని, ఈ మేరకు చర్యలు చేపట్టామని కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 23.45 కోట్ల సెస్సును వసూలు చేసినట్లు తెలిపారు. మార్చి నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు సెస్సును వసూలు చేస్తామన్నారు. కర్నూలు మార్కెట్ కమిటీ ద్వారా రూ.7.60 కోట్లు సెస్సును వసూలు చేయాల్సి ఉందని, అదే విధంగా ఆదోని మార్కెట్ కమిటీ నుంచి రూ.17.10 కోట్లు, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.6.10 కోట్లు, ఆలూరు నుంచి రూ.1.16 కోట్లు, పత్తికొండ నుంచి రూ.82 లక్షలు, కోడుమూరు నుంచి రూ.1.90 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.1.46 కోట్లు సెస్సును వసూళ్ల చేయాల్సి ఉందని తెలిపారు. కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి రూ.4.69 కోట్లు, ఆదోని నుంచి రూ.10.65 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి రూ.6.18కోట్లు, ఆలూరు నుంచి రూ.37.54 లక్షలు, పత్తికొండ నుంచి రూ.55.33 లక్షలు, కోడుమూరు నుంచి రూ.60.71 లక్షలు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.19.06 లక్షలు వసూలైందని ఏడీఎం తెలిపారు.

నిరంతరంగా హిందూ ధర్మ పరిరక్షణ

రాధా మనోహర్ దాస్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలో సనాతన హిందూ ధర్మ రక్షణ ఒక నిరంతర కార్యక్రమంలా కొనసాగుతూనే ఉందని హైందవ ధర్మ ప్రచారకులు రాధా మనోహర్ దాస్ అన్నారు. గురువారం నగర శివారులోని గోదా గోకుల క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన భక్తులకు ప్రవచన బోధన చేశారు. శుక్రవారం పత్తికొండలోని టీటీడీ కల్యాణ మండపంలో 'హైందవ పాంచజన్యము' అనే బిరుదుతో కర్నూలుకు చెందిన అనంత సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్టు ఘనంగా సత్కరించనుంది. ఈ నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణ ప్రచారంలో తనవంతుగా ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. హిందూ ధర్మం లోక శ్రేయస్సును కోరుతుంది. మన కట్టు బొట్టు సంప్రదాయ వ్యక్తీకరణ కూడా మనం ఆచరించే ధర్మంలో ఒక భాగమే.



హైందవ ధర్మ ప్రచారకుడు రాధా మనోహర్ దాస్

ఆలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలి

దేశంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగి ఉండేలా చట్టాలు రావాలి. కొన్ని ఆలయాల్లో ఆర్థిక భారంతో భగవంతునికి పూలు పెట్టే పరిస్థితి కూడా లేకపోవడాన్ని నేను చూశాను. అన్య మతాలకు చెందిన వారు అధికారులుగా ఉంటే ఆలయాల అభివృద్ధి సాధ్యం కాదు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మంత్రాలయం, డిసెంబరు 26 ఆంధ్రజ్యోతి: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. గురువారం దక్షిణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు రాఘవేంద్ర స్వామి నిజ బృందావనాన్ని దర్శించుకున్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 318 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో 318 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామంలో 19, నందవరం మండలం జొహరాపురంలో 1, ఎమ్మిగనూరు మండలం కందనాతిలో 19, కోసిగి మండలం సజ్జలగుడ్డంలో 8, కౌతాళం మండలం పొడలకుంటలో 7, మంత్రాలయం మండలం బసాపురంలో 3, ఆదోని మండలం కపటి గ్రామంలో 8, కోసిగి మండలం ఎండపల్లి గ్రామంలో 2, హొళగుంద మండలం హొళగుందలో 51, కౌతాళం మండలం మదిరిలో 2, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని తిప్పాయపల్లెలో 36, కల్లూరు మండలంలోని బస్తిపాడులో 8, వెల్దుర్తి మండలం నర్లాపురంలో 7, కర్నూలు రూరల్‌లోని ఎదురూరు గ్రామంలో 13, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలం తుగ్గలిలో 8, ఆలూరు మండలంలోని కమ్మరిచేడులో 97, చిప్పగిరి మండలం ఖాజాపురంలో 6, ఆస్పరి మండలం తురువగల్‌లో 10, హాలహర్వి గ్రామం గూళ్యంలో 10, జేకోసల్లి గ్రామంలో 3 మొత్తం 318 అర్జీలు వచ్చాయని డీఆర్వో తెలిపారు.

నేడు 24 గ్రామాల్లో సదస్సులు...

జిల్లాలో శుక్రవారం 24 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్‌లోని రోజావీధి, ఓర్వకల్లు మండలం శకునాల, కల్లూరు మండలంలోని బొల్లవరం గ్రామం, వెల్దుర్తి మండలంలో చెరుకులపాడు, కర్నూలు రూరల్‌లోని నిడ్జూరు, ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని వేముగోడు, నందవరం మండలం గురజాలలో, ఎమ్మిగనూరు మండలంలోని మల్కాపురం గ్రామం, కోసిగి మండలంలోని ఆర్లబండ, కౌతాలం మండలంలోని బాపురం, మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట, పెద్దకడుబూరు మండలంలోని మేకడోన, ఆదోని మండలంలోని సాంబగల్లు, నెట్టేకల్లు, హొళగుంద మండలం నగర కవ్వి గ్రామం, కోసిగి మండలంలోని పుట్టకుంట గ్రామం కౌతాళం మండలం కాత్రికి గ్రామం, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామం, తుగ్గలి మండలంలోని రాతన, కృష్ణగిరి మండలంలోని పోతుగల్, మద్దికెర మండలంలోని బురుజుల, ఆలూరు మండలంలోని మునసహల్లి, చిప్పగిరి మండలంలోని నన్నిచర్ల, ఆస్పరి మండలం బినిగేరి గ్రామాలు మొత్తం 24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ కమిటీ



కమిటీ సభ్యులతో ఎస్ఈ మనోహర్

నంద్యాల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రూరల్ వాటర్ సప్లైస్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పట్టణంలోని ఎస్ఈ కార్యాలయంలో గురువారం ఎస్ఈ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు జరగగా ఎన్నికల పరిశీలకుడిగా సంఘం సాంకేతిక విభాగపు రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా మధుశేఖర్, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ట్రెజరర్‌గా మహమ్మద్ జుబేర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పవన్‌కుమార్, కార్యదర్శిగా దివ్య, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు



పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు, సిబ్బంది

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమ శాఖ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ డీకే వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డీబీసీడబ్ల్యూవోగా పని చేస్తున్న వెంకటలక్ష్మమ్మ నెల్లూరు జిల్లాకు బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ఈ స్థానంలో డీకే వెంకటేశ్వర్లును కలెక్టర్ నియమించారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును ఏబీసీ డబ్ల్యూవోలు శ్రీనివాసులు, ఆంజనేయులు, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

వాతావరణానికి అనుగుణంగా..
సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నంద్యాల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మామిడి తోటలో సస్యరక్షణ చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగుచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడంతో తోటలు పూత మొగ్గదశలో, పచ్చిపూత దశలో ఉన్నాయని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఉష్ణోగ్రతలు అత్యల్పంగా ఉన్నాయన్నారు. దీంతో పండ్లతోటలకు కొన్ని రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అధికారుల సూచనలను పాటిస్తూ చీడ పీడలను నివారించుకోవాలని కోరారు. ప్రస్తుతం మామిడి తోటలకు నీరుకట్టడం ఆపివేయాలన్నారు. తేనే మంచు, పక్షికన్ను, బూడిద తెగులు నివారణకు ఇమిడోక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు, క్లోరోథలోనిన్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

కౌలు రైతు ఆత్మహత్య

గోనెగండ్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటెడు దిన్నె గ్రామానికి చెందిన బోయ నరసింహుడు(42) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక గురువారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బోయ నరసంహుడు కొనేళ్లుగా గ్రామంలోని ఉపేంద్ర రెడ్డికి చెందిన ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. నాలుగేళ్ళగా పత్తి, మిరప, ఉల్లి వేరుశనగ పంటలు సాగు చేశాడు. అయితే ప్రతిసారి పంట సక్రమంగా పండక పోవడం, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక పోవడంతో అప్పులయ్యాడు. ఈ ఏడాది తాను కౌలుకు తీసుకున్న ఐదు ఎకరాల పొలంలో మూడున్నర ఎకరం వరి పంట, మిగత పొలంలో వేరుశనగను సాగు చేశాడు. అయితే పంట నష్టం వచ్చింది. ఈ నాలుగేళ్లలో దాదాపు రూ.11లక్షలు అప్పులు అయ్యాయి. అప్పులు ఇచ్చిన వారు అసలు, వడ్డీ కట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆయన తీవ్ర మనో వేదనకు గురై గురువారం సాయంత్రం గ్రామ శివార్లలోని ఈశ్వర దేవాలయం దగ్గర ఉన్న పశువుల పాకలో ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. పశువుల పాక యజమాని లక్ష్మీకాంతరెడ్డి గమనించి మృతుని భార్య పార్వతికి తెలిపారు. నరసింహుడికి కుమారుడు, కూమార్తె ఉన్నారు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న బోయ నరసింహుడు

కర్నూలు మెడికల్ కాలేజీలో
నైపుణ్య రథం



కర్నూలు మెడికల్ కాలేజీలో జాన్సన్ అండ్ జాన్సన్ బస్సు

- నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ స్కిల్స్ తోడ్పాటు
- శస్త్ర చికిత్సలు, బేసిక్ సర్జికల్స్‌పై శిక్షణ
- కర్నూలుకు వచ్చిన జాన్సన్ అండ్ జాన్సన్ బస్సు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక శస్త్ర చికిత్స అంశాలపై వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక బస్సు కర్నూలు మెడికల్ కాలేజీకి వచ్చింది. జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్ (జేజేఐడబ్ల్యూ) పేరుతో ఈ వాహనాన్ని సమకూర్చారు. 2018 నుంచి దక్షిణ భారతదేశంలో వివిధ వైద్య కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు, పీజీలకు వృత్తి నైపుణ్యం పెంచే రెండు రోజుల బృహత్తర కార్యక్రమానికి కర్నూలు మెడికల్ కాలేజీ నిర్వహిస్తోంది. నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్స్ స్కీమ్ ద్వారా రూ.150 కోట్లతో ఈ ల్యాబ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. ఇందుకు జాన్సన్ అండ్ జాన్సన్ తోడ్పాటు అందిస్తోంది. ఈ ల్యాబ్ ద్వారా రెండు రోజులు మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులకు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోనున్నారు. ఈ స్కిల్ ల్యాబ్ దేశం నలుమూలల తిరుగుతూ పలు వైద్య కళాశాలల విద్యార్థులకు ఆధునిక వైద్యంపై అవగాహన శిక్షణ కల్పిస్తోంది.

ఏం నేర్చుకున్నారంటే..



శిక్షణలో పాల్గొన్న వైద్యవిద్యార్థులు

శస్త్ర చికిత్స చేసేటప్పుడు సింపుల్‌గా కుట్లు వేయడంలో కంటిన్యూ, వెర్టికల్, హారిజంటాల్ విధానాలు నేర్పించనున్నారు. కొత్తగా కుట్లకు బదులు స్టాప్లర్ వేయడం ల్యాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్ పద్ధతిలో చికిత్సలను మానిటర్లలో శిక్షణ ఇచ్చారు. ఎండోస్కోపిక్ స్టాప్లర్ విధానంలో నొప్పి ఉండదు. రక్తం ఎక్కువ పోదు. రోగులు శస్త్ర చికిత్స అయిన కొద్ది గంటల్లోనే నడవగలరు.

పేద రోగులకు ఎంతో మేలు



అధునాతన శిక్షణ సదుపాయాలతో కర్నూలు మెడికల్ కాలేజీకి వచ్చిన జాన్సన్ అండ్ జాన్సన్ ప్రత్యేక బస్సు ఉచితంగా వైద్య విద్యార్థులకు శిక్షణ అందించనుంది. ఈ శిక్షణ పేద రోగులకు ఎంతో మేలు కలుగుతుంది. మెడికోలు, పీజీలు సీనియర్ రెసిడెంట్‌లకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుంది.

డా.కే. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి

రెండు రోజుల శిక్షణ



ప్రత్యేక బస్సులో ప్రతి విద్యార్థికి రెండు గంటలు శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యంగా సర్జరీ, గైనిక్, ఆర్థో, ఆప్తమాలజీ వైద్య విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యంగా రోగికి కుట్లు వేసే విధానం, ల్యాపోస్కోపిక్ స్టాప్లర్స్ నాటింగ్, హ్యాండ్ నాట్స్, బొవెల్ స్టాప్లర్స్ వంటి శస్త్ర చికిత్స అనుబంధ వైద్య ప్రక్రియలపై శిక్షణ ఇవ్వనున్నారు. సుమారు 100 మంది పీజీ, సీనియర్ రెసిడెంట్లు ఈ రెండు రోజుల శిక్షణ పొందనున్నారు.

- డా. హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

విద్యుత్ చౌర్యంపై 'విజిలెన్స్' దాడులు

- 16 మందిపై కేసుల నమోదు
- రూ.8 లక్షల అపరాధ రుసుము



చేపలచెరువు యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

గడివేముల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల, కొరటమద్ది, తిరుపాడు గ్రామాల సమీపంలోని చేపల చెరువులపై గురువారం ఏపీ ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ డీఈ కృష్ణమూర్తి, ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా విడిపోయి దాదాపు 20 చేపల చెరువుల వద్ద ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చేపల చెరువుల యజమానులు యథేచ్ఛగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. నామ మాత్రపు విద్యుత్ కనెక్షన్‌లు తీసుకొని చేపల చెరువులకు యథేచ్ఛగా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దాడుల అనంతరం ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు యాదవ్ మాట్లాడుతూ 20 చేపల చెరువులను తనిఖీ చేయగా 16 మంది చేపల చెరువుల యజమానులు విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తించామని చెప్పారు. 9 మంది చేపల చెరువుల యజమానులు మీటర్‌ను బైపాస్ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తించారు.

మరో 7 మంది చేపల చెరువుల యజమానులు విద్యుత్ తీగల నుంచి నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడేందుకు వినియోగిస్తున్న విద్యుత్ తీగలను కట్ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన చేపల చెరువుల యజమానులు రాజు, శంకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, సుబ్బయ్య, మరో 12 మందిపై కేసులు నమోదు చేసి దాదాపు రూ.8 లక్షలు అపరాధ రుసుము విధించామని తెలిపారు. అనంతరం విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారికి విజిలెన్స్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ దాడుల్లో ట్రాన్స్‌కో విజిలెన్స్ ఏఈ రామాంజనేయులు, ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో విజిలెన్స్ తనిఖీలు



గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఆదోని, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ నిబంధనలు పాటించని 5 హోటళ్లపై చర్యలు తీసుకున్నామన్నారు. హోటళ్లలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాడుతున్న మిలిటరీ హోటల్‌లో ఒకటి, శివ గోబీ పాయింట్‌లో రెండు, ఆర్గానిక్ టీ వనంలో ఒకటి, బాబా దమ్ బిర్యాని హోటల్‌లో రెండు, శివ చికెన్ సెంటర్ నుంచి రెండు సిలిండర్లను సీజ్ చేశామని తెలిపారు. విజిలెన్స్ అధికారులు విశ్వనాథ్, వెంకటరమణ, పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్ వలిభాష పాల్గొన్నారు.

నేడు గాలిబ్ జయంతి సభ

కర్నూలు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కోనాశశిధర్, ఉపకులపతి పీఎస్ షేక్షావలి, ఇదిరిష్ అహమ్మద్, అజరాజావేద్ హాజరవుతారని తెలిపారు

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించండి

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త నిల్వకేంద్ర ఏర్పాటుకు స్థలాలను అన్వేసించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రెడ్‌క్రాస్‌సొసైటీ ముద్రించిన గ్రీట్‌విత్ గ్రీన్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలో రక్తనిల్వ కేంద్ర ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడేలా నోట్‌బుక్స్‌తో పాటు విద్యాసామగ్రిని అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాయడానికి వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం



ఆకుల కల్యాణ్(ఫైల్)

శిరివెళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరు కావాలని కలలుగన్న ఓ యువకుడి ఆశను మృత్యువు కబలించింది. బాగా చదివి ఉద్యోగం సాధించి తల్లి రెక్కల కష్టాన్ని తీర్చాలనుకున్న ఆ యువకుడిని విధి చిన్నచూపు చూసింది. మృత్యువులా దూసుకొచ్చిన కారు యువకుడిని బలిగొన్న హృదయవిదారక ఘటన కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. శిరివెళ్ల పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆళ్లగడ్డ పట్టణంలోని సత్రం వీధికి చెందిన ఆకుల లక్ష్మీదేవి కుమారుడు ఆకుల కల్యాణ్(25) అనే యువకుడు నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఇంజ నీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో సెమిస్టర్ పరీక్ష రాసేందుకు బైక్‌పై నంద్యాలకు వెళ్తుండగా శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామ సమీపంలో కడప నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా కల్యాణ్ బైక్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యార్థి తలకు తీవ్ర గాయం కావడంతో అధిక రక్తస్రావమై అక్కడి కక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డుపై రక్తపుమడుగులో విగతజీవిగా కనిపించడంతో కల్యాణ్ తల్లి గుండెలవిసేలా బోరున విలపించింది. కల్యాణ్ తండ్రి లక్ష్మీనారాయణ కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భర్త మరణానంతరం.. నేడు కుమారుడు సైతం రహదారి ప్రమాదంలోనే మృత్యువాత పడడంతో ఆ తల్లి రోదనలు పలువురిని కలిచివేశాయి. కల్యాణ్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.







వివాహ వేడుకకు హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

మంత్రి టీజీ భరత్ కుమార్తె వివాహానికి ప్రముఖుల హాజరు

కర్నూలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టీజీ శిల్పాభరత్ దంపతుల కుమార్తె శ్రీహర్యపాణ్య, బొమ్మిడాల వెంకటశ్రీ నళిన్ వివాహం గురువారం కన్నుల పండువగా జరిగింది. హైదరాబాదులోని శంషాబాద్ సమీపంలో ఉన్న జీఎంఆర్ హరీణా ఫంక్షన్ హాలులో ఈ వేడుకలు జరిగాయి. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామనాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్‌లతో పాటు ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధువు శ్రీహర్య పాణ్య ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ మనుమరాలు. తెలుగురాష్ట్రాల ప్రముఖులతో పాటు జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, టీడీపీ ముఖ్య నాయకులు టీజీవీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌తో టీజీ వెంకటేశ్

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

ఓర్వకల్లు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నామని ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి అన్నారు. తిప్పాయపల్లె గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సులో గురువారం ట్రైనీ కలెక్టర్‌తోపాటు తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అడంగల్, భూ తగాదాలు, సరిహద్దుల సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ విద్యాసాగర్ మాట్లాడుతూ తిప్పాయపల్లెలో రైతుల సమ స్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఈవో మద్దిలేటి, నాయకులు హరినాథరెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్రా మిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, భాస్కర్, మెకానిక్ శంకర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా లే అవుట్లు వేస్తే చర్యలు

సి.బెళగల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అధికారుల అనుమతి లేకుండా లే అవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని ఈవోఆర్డీ ఈశ్వరస్వామి హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమా వేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాణెమ్మ, సూపరిం టెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

గూడూరు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం గూడూరు మండలంలోని కె నాగలాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధుల కింద కె.నాగలాపురం గ్రామంలో సచివాలయం ముందు రూ.2 లక్షలతో నిర్మించిన ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను క్వాలి టీ కంట్రోల్ అధికారులు కచ్చితంగా చెక్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటర్నల్ సీసీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పం చాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట డ్వామా పీడీ వెంకటరమణయ్య, పంచాయతీరాజ్ ఈఈ మద్దన్న, డీపీవో భాస్కర్, గూడూరు తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివ నాగప్రసాద్ ఉన్నారు.


సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కర్నూలు మండలంలోని బి. తాండ్రపాడు, పంచలింగాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాలీబాల్, కబడ్డీ పోటీలను గురువారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో పంచలింగాల సర్పంచ్ జయన్న, ఎంపీ టీసీ మద్దిలేటి, పంచలింగాల రాజశేఖర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు భాస్కరరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనతో జీవన్ముక్తి

ధర్మ ప్రచారకుడు రాధా మనోహర్ దాస్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జ్ఞాన సముపార్జనతో జీవన్ముక్తి లభిస్తుందని హైందవ ధర్మ ప్రచారకుడు రాధా మనోహర్ దాస్ భక్తులకు ఉద్బోధించారు. ధనుర్మాసం సందర్భంగా గురువారం నగర శివారులోని గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదా గోకులం)లో జరుగుతున్న ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నియమ నిష్ఠలతో భగవంతుడిని సేవించుకుంటే సకల సంపదలు మన వశమవు తాయన్నారు. కాగా గోకులంలో కొనసాగుతున్న అఖండ విష్ణు సహస్ర నామ పారాయణ సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఐదో రోజున గురు వారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, ఛైర్మన్ పల్లెర్ల నాగరాజు, గోదాగోకులం సభ్యులు మహేశ్వరరెడ్డి, తల్లం సురేశ్, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం, టి. శ్రీనాథ్, చిత్రాల వీరయ్య, వేముల జనార్ధన్, బాల సుధాకర్, అలయ వేద పండితులు రమేష్ బట్టార్, కిరణ్ బట్టార్, మహిళా విభాగం సభ్యులు ధర్మరాజు శైలజ, పాలాది విజయ, చంద్రకళ, సరిత పాల్గొన్నారు.


భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న రాధా మనోహర్ దాస్

రిటైర్డ్ ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. గత ఏప్రిల్‌లో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఇప్పటికీ గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలను చెల్లించకుండా ఆపేశారనీ, వాటిని కూడా చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీజీ వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ, పత్రికా ప్రధాన సంపాదకులు రత్నం యేసేపు, రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలని డీటీఎఫ్ కోరుతుందన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు సమాంతర మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు.

ఘనంగా కేఈ శ్యాం బాబు జన్మదిన వేడుకలు


టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లీగల్ సెల్ కార్యదర్శి ఎల్‌వీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, ఆధ్వర్యంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో శాసన సభలో అడుగు పెట్టి పత్తి కొండ నియోజకవర్గ సమస్యలపై గళం విప్పడమే కాకుండా, అభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువ త ఉపాధ్యక్షులు పేరపోగు రాజు, కె.తిరుపాల్‌బాబు, మంచాలకట్ట భాస్క రొరెడ్డి, బేత కృష్ణుడు, షేక్షావలి పాల్గొన్నారు.

కళాంజలి నర్సింగ్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ విజయవాడ-2023-24 వార్షిక సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఫలితాల్లో కర్నూలుకు చెందిన కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (కిమ్స్) కాలేజీ విద్యార్థులు ప్రతిబ కనబరిచారు. ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు మాత్రమే వరుసగా 20 డిస్టింక్షన్, 45 ఫస్ట్ క్లాస్, 10 సెకండ్ క్లాస్‌గా ఉత్తీర్ణులయ్యారు. కాలేజీ టాపర్‌గా ఎన్.వర్ష, సి.నవీన్ కుమార్, ఎం.రవితేజ, ఇందుశ్రీగా నిలిచారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు కాలేజీ ఛైర్మన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అర్చన అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలి: డీసీసీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు నిలిపి వేస్తూ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో రాష్ట్రంలో అభ్యాసక సహాయ కేంద్రాల్లో సుమార్ 12 వేల మంది విద్యార్థులు చేరారని తెలిపారు. సార్వత్రిక యూనివర్సిటీలో ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల విద్యార్థులు 89 శాతం అడ్మిషన్లు తీసుకుంటున్నారని తెలిపారు.

అధునాతన వైద్య వసతులతో ప్రత్యేక బస్సు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శస్త్ర చికిత్సకు సంబంధించిన అంశాలపై ఆరోగ్య నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు అధునాతన వసతులతో కూడిన జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ ప్రత్యేక బస్సు కర్నూలు మెడికల్ కాలేజీకి వచ్చిందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు తెలిపారు. శిక్షణ బస్సును గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.పి.హరి చరణ్‌తో కలిసి సూపరింటెండెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ సాధారణ ల్యాప్రోస్కోపిక్, గైనకాలజీ, యురాలజీ, పీడీయాట్రిక్, ఆప్తామాలజీ శస్త్ర చికిత్స వంటివి నేర్చుకోవ చ్చునన్నారు. ఈ బస్సులో ఈ నెల 26, 27 తేదీల్లో వివిధ రకాల కుట్లకు సంబంధించిన శిక్షణ ల్యాప్రోస్కోపిక్ పేగుల ఆపరేషన్‌లో ఉపయోగించే స్టాప్లర్‌లు పరికరాల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాన్సన్ అండ్ జాన్సన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న జరిగే సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని నగర కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. గురువారం గోకారినగర్ కార్యాలయంలో విలీన సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్), న్యూ డెమోక్రసీ పార్టీల మధ్య 2013లో విభేదాలు రావడంతో రెండుగా చీలిపోయిందన్నారు. రాజకీయ విభేదాలు, నిర్మాణ సమస్యలు పరిష్కరించుకుని ఒకే న్యూ డెమోక్రసీగా ఏర్పడాలని రెండు కేంద్ర కమిటీలు చర్చించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగనా యకుడు, సురేష్‌నాయక్, దాము పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభి వృద్ధి కోసం ఈనెల 29న ఎమ్మిగనూరులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా 23వ మహాసభలను పురస్కరించుకుని గురువారం సుందరయ్య భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా గౌస్‌దే శాయ్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం మరింత పోరాడేం దుకు ప్రజలను సమాయత్తం చేయడానికే భారీ బహిరంగసభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు సీపీ ఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్, రాష్ట్ర కార్యద ర్శివర్గ సభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రామక్రిష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ ఆనంద్‌బాబు, ఎం.రాజశేఖర్, టి.రాముడు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

వైద్యసేవలకు అంతరాయం


మట్టికుప్ప ఉండడంతో ఆగిన 104 వాహనం

కోడుమూరురూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి మజారా బైనదొడ్డి గ్రామ ప్రజలకు 104 వైద్యసేవలకు అంతరాయం కలిగింది. స్థానిక స్టేజీ నుంచి గ్రామంలోకి సుమారు 700 మీటర్ల దూరం ఉంది. ఆ దారి పూర్తిగా దెబ్బతినడంతో పల్లెపండుగలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తికా వచ్చింది. అయితే గ్రామ సమీపంలో రోడ్డుపై మట్టికుప్ప ఉండడంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపో కలు సాగిస్తున్నాయి. గురువారం గ్రామంలో వైద్యసేవలు అందించ డానికి 104 వాహనం సిబ్బంది విచ్చేశారు. రోడ్డు మధ్యలో మట్టికుప్ప ఉండడంతో ముందుకెళ్లే మార్గం లేక పులకుర్తికి మళ్లించారు. ఇక గ్రామంలో వృద్ధులు వాహనం వస్తుందని ఎదురుచూసి ఇళ్లకు వెళ్లిపోయారు.

పులకుర్తిలో గిరకబండి పోటీలు

కోడుమూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తిలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని అంబేడ్కర్ యువజన సంఘం అధ్వర్యంలో గురువారం ఎద్దులు గిరకబండి లాగు పోటీలు నిర్వహించారు. పోటీలను టీడీపీ నాయకుడు ఇమ్మానియేలు, సంఘపెద్ద ఆరెకంటి సూర్యనారాయణ ప్రారంభించారు. పోటీల్లో సుమారు 6 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో సుధాకర్ ఎద్దులు 361 అడుగులు దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. రెండు, మూడు స్థానాల్లో నరసింహుడు, కుర్వకేశమ్మ ఎద్దులు నిలిచాయి. విజేతలకు టీడీపీ నాయకుడు ఇమ్మానియేలు వరుసగా రూ. 15 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు అందించారు. అలాగే కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, సంఘపెద్దలు లక్ష్మన్న, గిరిబాబు, ప్రసాద్, పరుశరాముడు, పెద్దలింగన్న, నాగన్న, మారెప్ప, పెద్దగిడ్డయ్య పాల్గొన్నారు.

క్రిస్మస్ క్రీడా పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని నగరంలోని కోల్స్ సెంటినియల్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చర్చి పాస్టర్ రెవ.అనిల్ సామేల్, రెవ. జీవన్ రావు, చర్చి అధ్యక్షులు ఏడీఏ లింకన్‌లు పాల్గొని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడల కన్వీనర్ విజయ కుమార్, పాల్ సుధాకర్, జయకుమార్, దాసరి సుధీర్ క్రీడల వివరాలు తెలియజేశారు. వాలీబాల్, మినీ ఫుట్‌బాల్, షటిల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నిస్, హాకీ తదితర క్రీడాంశాలలో వయసును బట్టి క్యాటగి రీలుగా చేసి పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం మహిళ లతో త్రోబాల్ పోటీలు నిర్వహించారు.

'ఆధ్యాత్మిక భావనతోనే శాశ్వత ఆనందం'

కర్నూలు కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనతోనే శాశ్వత ఆనందం సాధ్యమని స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు, గీతారత్న పురస్కార గ్రహీత డీవీ రమణ అన్నారు. గురువారం సఫల ఏకాదశి పర్వదిన సందర్భంగా నగరంలోని సంకల్ బాగ్‌లో గల గీతా ప్రచార ధామంలో సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. గీతా ప్రచార సంఘం సభ్యులు ఇల్లూరు రమణ, సింహాద్రి రమేష్, మహాబలేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి తిరుప్పావడ సేవ: నగరంలో నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల భరతమాత ఆలయంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న ధనుర్మాస వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి 'తిరుప్పావడ సేవ' నిర్వహించారు. ఆలయ వేద పండితుడు మధుసూదన ఆచార్యుల ఆధ్వర్యంలో మహిళా భక్తులు స్వామివారి రూపాన్ని ప్రసాదాలతో రూపొందించారు. ఆలయంలోని శ్రీవారిని ప్రత్యే కంగా పుష్పాలంకరణతో తీర్చిదిద్దారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, సందడి మహేష్, మల్లెల పెద్దపుల్లారెడ్డి పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులకు శనివారం కర్నూలు కలెక్టరేట్ ఆవరణంలోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫొటో, వీడి యో జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి తెలిపారు. పౌర సంబంధాల శాఖ కార్యాలయ, మీడియా రూమ్ వద్ద జర్న లిస్టులకు ఎముకలు, కంటి, వినికిడి సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

క్యాజువాల్టీకి ఐదు మల్టీచానల్ మానిటర్స్


కొత్తగా వచ్చిన మానిటర్స్‌తో వైద్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గుండెకాయ లాంటి అత్యవసర విభాగం (క్యాజువాల్టీకి) ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు కొత్తగా ఐదు మల్టీచానల్ మానిటర్స్ మంజూరు చేశారు. గురువారం క్యాజువాల్టీలో కొత్తగా వచ్చిన మానిటర్స్‌ను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ రామశివనాయక్ ఆధ్వర్యంలో అమర్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన మల్టీ చానల్ మానిటర్స్‌తో రోగులు బీపీ, పల్స్‌రేట్, టెంపరేచర్, ఈసీజీ వివరాలు కనుబడు తాయన్నారు. దీని వల్ల రోగి ఆరోగ్య పరిస్థితి త్వరగా తెలుసుకుని చికిత్స అందించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డా.ఫయాజ్, హెడ్ నర్సు ఈశ్వరమ్మ, స్టాఫ్ నర్సులు కళ్యాణి, రాజన్న, మహేష్ పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి: ఎంపీడీవో

ఓర్వకల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగు చేసే రైతులు జాగ్రత్తలు తప్పక పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గురువారం పూడిచెర్ల గ్రామంలో రైతులు సాగు చేసిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గోకులాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. కలెక్టర్ మండలానికి 135 ఎకరాలు మంజూరు చేశారని, ఆయన ఆదేశాల మేరకు కేతవరం, పూడిచెర్ల, శకునాల, తిప్పా యపల్లె, కాల్వ, హుశేనాపురం పండ్ల తోటలను పరిశీలించామన్నారు. ఆయన వెంట మల్లికార్జున, వీరాంజనేయులు, రామకృష్ణ, లక్ష్మీదేవి, రమణమ్మ, నాగశేషు, రైతులు ఉన్నారు.

బడుగు బలహీనవర్గాలకు అండగా సీపీఐ

ఓర్వకల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండేది సీపీఐ అని మండల కార్యదర్శి ఆవుల రమేష్ అన్నారు. గురువారం ఓర్వకల్లులోని సీపీఐ శత వార్షికోత్సవాన్ని మండల సహాయ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రమేష్ హాజరై సీపీఐ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు బాబు, సంజీవ, ఏసేపు, వీరేంద్ర, ఇస్మాయిల్, వలి, మునిస్వామి పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ కమలపాలిక' నాటకానికి నటరాజ పూజ


నటరాజు పూజలో పాల్గొన్న టీజీవీ కళాక్షేత్రం కళాకారులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎన్టీఆర్ నాటక పరిషత్ జాతీయ నాటక పోటీలకు ఇటీవల ఎంపికైన 'శ్రీకృష్ణ కమలపాలిక' పౌరాణిక పద్య నాటకానికి గురువారం సాయంత్రం నటరాజ పూజ నిర్వహించారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి మూడు నాటకాలను ఈ పోటీలకు ఎంపిక చేశారని, రాయలసీమ నుంచి శ్రీకృష్ణ కమలపాలిక ఒక్కటే ఎంపిక కావడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో జీవీ శ్రీనివాసరెడ్డి, ఎస్ మహ్మద్‌మియా, సంగా ఆంజనేయులు, వి.రాముడు, కె.బాలవెంకటేశ్వర్లు, వన్నెం బలరాం, సంగీత నిపుణుడు పాండురంగయ్య పాల్గొన్నారు.

గుండ్రేవులలో 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్/కోడుమూరు రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలంలోని గుండ్రేవుల, కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తిలో వ్యవసాయాధికారులు గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓలు మల్లేష్ కుమార్, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగుతోందని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు. ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, తిమ్మయ్య చౌదరి ఉన్నారు.

కొనసాగింపు అభినందనీయం

ఆదోని టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాన్ని సీఎం చంద్రబాబు కొనసాగించడం అభినందనీయమని టీడీపీ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ ఆచారి, బాలాజీ గురువారం అన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూనే, రాష్ట్ర అభివృద్ధికి భారీ పరిశ్రమలను తీసుకొని రావడం చంద్రబాబు పని తీరుకు నిదర్శనమని అన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సు

ఆలూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రభుత్వం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తుందని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. గురువారం కమ్మరచేడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సర్పంచ్ సుమతీ రెడ్డి, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్‌వోలు లోకవీర్, రవికుమార్, లింగన్న, వన్నూర్ పాల్గొన్నారు.

విద్యారంగ సంక్షేమానికి పోరాటం


ప్రచారజాత నిర్వహిస్తున్న నాయకులు

ఆలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ పోరాటం చేస్తుందని రాష్ట్ర సహాధ్యక్షుడు కె సురేష్ కుమార్ అన్నారు. గురువారం అంబేడ్కర్ కూడలిలో ప్రచార జాత నిర్వహించారు. వచ్చే నెల 5 నుంచి 7 వరకు కాకినాడలో యూటీఎఫ్ 17వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తామని, జయప్రదం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ ఆర్థిక కార్యదర్శి హెహోషువ, జిల్లా కార్యదర్శి జయరాజు జిల్లా కార్యదర్శులు సురేష్‌బాబు, వెంకటేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఖాసిం, ఆలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవరాజు, రూపలత పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

దేవనకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29,30 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించనున్న 23వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు వీరశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని పి. కోటకొండ అంజనేయస్వామి ఆలయం వద్ద గోడపత్రికలను విడుదల చేశారు. అస్లాంబాషా, సుభాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మద్దికెర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, మండల టీడీపీ అధ్యక్షురాలు గూడూరు కవిత సూచించారు. గురువారం స్థానిక బసవన్న గుడి వద్ద ప్రాథమిక పాఠశాలలో పలకలు పంపిణీ చేశారు. గడ్డం రామాంజులు, ఆకుల వేణుగోపాల్, ఉదయ్‌కుమార్, జంబునాథ్ రాయుడు, రామాంజులు, వీరేబ, ఉసేన్, సుధాకర్, ఆవుల పెద్దన్న, టైలర్ హరి, ఆంజనేయ పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాపు బలిజ నాయకుడు వంగవీటి మోహన్ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలని కాపు తెలగ బలిజ సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, చందం మాలికార్జున అన్నారు. గురువారం బీమాస్ హాల్‌లో వంగవీటి మోహన రంగా చిత్రపటానికి నివాళి అర్పించారు. కుల, మతాలకతీతంగా వంగవీటి మోహన్ రంగా సేవా కార్యక్రమాలు చేశారన్నారు. గోపాలకృష్ణ, న్యాయవాది నాగేంద్రయ్య, ప్రభు మాణిక్ రెడ్డి, శేషన్న, రామకృష్ణ, బీమ లింగప్ప పాల్గొన్నారు.

కందులను ప్రభుత్వం కొంటుంది

మద్దికెర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కందులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఏవో రవి అన్నారు. గురువారం రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. క్వింటం రూ.7,500ల ప్రకారం కొంటామని, బయట వ్యాపారులు రూ.7వేలకు కందులను కొనుగోలు చేయడమే కాకుండా తరుగు పేరుతో మోసం చేస్తారని రైతులు జాగ్రత్త వహించాలన్నారు. మార్క్‌ఫెడ్ వారు తరుగు తీసుకోరన్నారు.

రీసర్వే తప్పులను సరి చేయండి

తుగ్గలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రీసర్వే తప్పులను సరి చేయాలని తహసీల్దార్ రమాదేవికి రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం తుగ్గలిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి, రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, ఈవో వీరయ్య, వీఆర్వో నవీద్ పటేల్, ఫారెస్టు ఆఫీసర్ లక్ష్మన్న, సర్పంచ్ రవి, తదితరులు ఉన్నారు.

మిరపకు తెగుళ్లు
రైతుకు దిగులు

- దిగుబడి తగ్గిపోతుందని రైతు ఆవేదన
- మార్కెట్‌లో ధర కూడా పతనం


మద్దికెర మండలంలో తెగులు సోకిన మిరప పంట

మద్దికెర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల్లో 1700 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.70 నుంచి 80వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల సోకడంతో రైతులు దిగులు చెందుతన్నారు.

తెగుళ్ల దాడి..

మిర్చి పంటకు ఆకుముడుత, బొబ్బెర, నల్లి, జెమినీ వైరస్, కొమ్ముకుళ్ల తెగుళ్ల సోకాయి. ఒక్కసారిగా మూడు, నాలుగు రకాల తెగుళ్ల వ్యాపించడంతో చెట్టంతా ముడచుకుపోతోంది. బొబ్బ తెగులుతో పంట ఎండుబారుతుండగా.. ఆకుముడతతో ఆకులు ముడత పడుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలా మందులు పిచికారీ చేయడంతో అదనపు ఖర్చు అవుతుందని అంటున్నారు.

తగ్గనున్న దిగుబడి, ధర పతనం..

ఈ దఫా తేజా విత్తనం సాగు చేశామని, ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. మూడు, నాలుగు రకాల తెగుళ్ల వ్యాపించడంతో దిగుబడిచ గణనీయంగా తగ్గే ప్రమాదమందని ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు దిగుబడి తగ్గుతుంటే, మరోవైపు మార్కెట్‌లో కిలో రూ.15 నుంచి రూ.18లకు ధర పడిపోవడంతో పంట కోయలేక అలాగే వదిలేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లతో కోలుకోలేని దెబ్బ



రెండెకరాల్లో మిరప సాగు చేశా. రూ.2లక్షలు ఖర్చు యింది. బాగా పెరిగిందనుకోలోపే నల్లి, ఆకు ముడుత తెగుళ్లు ఆశించాయి. దీనికి తోడు తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపు లోకి రావడం లేదు.

నారాయణస్వామి, బసినేపల్లి

సలహామేరకు పురుగు మందులు వాడాలి



మిరపకు ఆకు ముడుత, జెమినీ వైరస్, పూత పురుగు, బొబ్బెర తెగుళ్ల సోకాయి. వీటి నివారణకు టిప్రోనిల్, ఇమ్డాక్లో ప్రిడ్ లీటరు నీటిలో 2 గ్రాములు లేదా టిప్రోనిల్ డయామాక్సైడ్ పంటపై పిచికారీ చేయాలి. కార్బసల్ఫైడ్ ఫైండోమెట్ బ్లూఫెండామైండ్ గ్రేసియా మందులు వాడాలి. వీటితోపాటు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్, బూస్టర్ డోస్‌గా వాడాలి. వివరాలకు కార్యాలయంలో సంప్రదించండి. **- రవి ఏవో.**

భూ సమస్యల పరిష్కారం

హొళగుంద, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ సతీష్ గురువారం అన్నారు. హొళగుంద రెవెన్యూ సదస్సులో 51అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. డీటీ నిజాముద్దీన్, ఎండోమెంట్ అధికారి నరేంద్ర, అటవీ శాఖ అధికారులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

హాలహర్వి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. గురువారం మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే చేస్తున్నామని, ఇల్లు కావలసిన వారు సచివాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పనులు చేసిన వారికే వేతనాలు

తుగ్గలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసిన వారికే వేతనాలు ఇస్తామని ఏపీవో హేమసుందర్ అన్నారు. గురువారం జి.ఎర్రగుడిలో జాతీయ ఉపాధి పనులను తనిఖీ చేశారు. టీఏ ఫరీదప్ప, ఎఫ్ఏ వెంకటప్ప, మేట్లు తిరుపాలు తదితరులు ఉన్నారు.

సీపీఐ ఉత్సవాలు

వెల్దుర్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ నాయకులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలను ఆలూరు పెద్దహోత్నూరు, మొలగవల్లి గ్రామాల్లో గురువారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. గోపాల్, సిద్ధలింగ రాముడు, వన్నూర వలి, భీమన్న, రామన్న పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఐ

మద్దికెర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పేదల పక్షాన పోరాడుతుందని పార్టీ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి పెరవలి సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని బసినేపల్లి, పెరవలి గ్రామాల్లో జెండాను ఆవిష్కరించారు. శ్రీకాంత్, రంగస్వామి, రామాంజులు ఉన్నారు.

జయప్రదం చేయాలి

హొళగుంద, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా సహా సభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆలూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి హనుమంతు గురువారం కోరారు. వెంకటేష్ నాగరాజు,రవి కుమార్, పంపాపతి, హమాలీలు నాగరాజు, ఉలిగయ్య, సలీమ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్యాంబాబు పుట్టిన రోజు వేడుకలు

- కేక్ కట్‌చేసిన టీడీపీ నాయకులు
- రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ


పత్తికొండ పార్టీ కార్యాలయంలో సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో..


హైదరాబాద్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే


తుగ్గలి: కేక్ కట్ చేస్తున్న మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి

పత్తికొండ, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పుట్టినరోజు వేడుకలు గ్రామాలు, మండల కేంద్రాలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి కేక్‌కట్‌చేశారు. మాజీ జడ్పీటీసీ హోటల్ శ్రీనివాసులు, మాజీ సర్పంచులు ఈశ్వరప్ప, తిప్పన్న, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పోస్టాఫీసు సమీపంలో టీడీపీ మైనార్టీసంఘంనాయకుడు గుండు ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ సీనియర్‌నాయకుడు బీటి గోవింద్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు.

హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసిన పత్తికొండ నాయకులు

పత్తికొండ టీడీపీ నాయకులు బత్తిన లోక్‌నాథ్, వెంకటపతి, పుండుకూర బ్రహ్మయ్య, పత్తిపాటి ప్రకాష్, క్రాంతిరవి, పర్లప్రకాష్, హరినాథ్‌గౌడ్ తదితరులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే శ్యాంబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మద్దికెర: మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, బసినేపల్లి, బురుజుల తదితర గ్రామాల్లో నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, తెలుగు యువత నాయకులు చంద్రశేఖర్‌గౌడు, పెరవలి రామాంజులు, ఎడవలి ఆకుల వేణుగోపాల్, ఆనందకుమార్, రమేష్, మాజీ ఉప సర్పంచ్ శ్రీరాములు, మునిరెడ్డి, హరినాథగౌడు, తిమ్మప్ప పాల్గొన్నారు.

తుగ్గలి: ఎమ్మెల్యే శ్యాంబాబు పుట్టిన రోజును అన్ని పల్లెలో వేడుకలు చేసుకుటున్నారని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, కన్వీనర్ తిరుపాల్ నాయుడు, వెంకటస్వామి, మిద్దె వెంకటేష్ యాదవ్ అన్నారు. గురువారం తుగ్గలి, జొన్నగిరి, బొందిమడుగుల తదితర గ్రామాల్లో కేక్ కట్ చేశారు. తుగ్గలిలో మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ బాషా, ఏపీవో హేమసుందర్, ఏపీఎం రాధాకృష్ణ కేకు కట్ చేశారు. బాలన్న, మిద్దె రవికుమార్, సర్పంచులు ఓబులేసు, రవి, లక్ష్మణస్వామి, సంగాల కృష్ణ, ప్రతాప్‌యాదవ్, డీలర్ తిమ్మప్ప, లక్ష్మీనారాయణ చౌదరి, ఐస్ మల్లయ్య, రాజశేఖర్, సురేష్, పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, మండలాధ్యక్షుడు బలరాంగౌడు, రామకృష్ణాచారి, సుధాకర్‌గౌడ్, ఆనంద్, ఈదుల వెంకటరాముడు, బజారి పాల్గొన్నారు.

భూస్వాములకు సింహస్వప్నం.. ఎర్రజెండా

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య
- పత్తికొండలో బైక్ ర్యాలీ


పత్తికొండ పట్టణంలో సీపీఐ నాయకుల బైక్ ర్యాలీ

పత్తికొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూస్వామ్య, పెత్తందారులకు ఎర్రజెండా సింహస్వప్నమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. పార్టీ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో గురువారం నిర్వహించారు. ముందుగా ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభలో మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర సీపీఐది అన్నారు. పేదలకు లక్షలాది ఎకరాల భూ పంపిణీ చేసిందన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి, లౌకికవాదన పరిరక్షణకు పోరాటాల చేద్దామని పిలుపునిచ్చారు. మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు సురేంద్రకుమార్, కృష్ణయ్య, నాగరాజు, కారన్న, వెంకట్రామిరెడ్డి, సిద్దు, వీరేష్, నెట్టికంటయ్య, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


బహుమతులు ఇస్తున్న న్యాయాధికారి యజ్ఞ నారాయణ

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని ఆదోని సీనియర్ సివిల్ న్యాయాధికారి యజ్ఞ నారాయణ అన్నారు. గురువారం బీమా ఇంజనీరింగ్ కళాశాలలో లీగల్ సెల్ సర్వీస్ అధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సురేంద్రబాబు న్యాయవాది లోకేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో గోడపత్రికలను విడుదల చేశారు. రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, నాయకులు రంగన్న పాల్గొన్నారు.

భూ సమస్యలు లేకుండా చూస్తాం

హలహర్వి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు లేకుండా చూస్తామని తహసీల్దార్ నజీమ భాను అన్నారు. మండలంలోని గురువారం జె.హోసళ్లీ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. సర్వేయర్ భార్గవి, ఆర్ఐ మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు, అండగా ఉంటాం


దేవరలో పాల్గొన్న ఉమాపతినాయుడు

ఆదోని రూరల్ డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు భరోసా ఇచ్చారు. గురువారం గణేకల్లులో బంగారమ్మ దేవరలో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో మంచే జరుగుతుందని, మీనాక్షి నాయుడు కుటుంబం ఎళ్లవేళలా అండగా ఉంటుందన్నారు. విరుపాక్షి, బంగారయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


తురవగల్లులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఆస్పరి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. గురువారం తంగరడోణ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తురవగల్లులో రెవెన్యూ కార్యదర్శి రామాంజినేయులు సదస్సు నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తలారి సిద్ధప్ప పాల్గొన్నారు.

ఇబ్బంది కలిగించవద్దు

ఆలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. గురువారం పాత బస్టాండ్ వద్ద పళ్ళు, కూరగాయల, పూల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బస్సుల రాకపోకలకు వీలులేకుండా అడ్డదిడ్డంగా వ్యాపారాలు పెట్టుకోవడం సరికాదన్నారు. బస్టాండ్ వద్ద అంగళ్లను తొలగించాలని సూచించారు.

దుస్తుల పంపిణీ

ఆదోని రూరల్ డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెట్టేకల్లు టీడీపీ నాయకులు నాగరాజు గురువారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. క్రిస్మస్ సందర్భంగా 50 మందికి పైగా పేదలకు పంపిణీ చేశామన్నారు.

ఎమ్మెల్యేకు ప్రజలు కప్పం కడుతున్నారు

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని గెలిపించుకొని ప్రజలే ఆయనకు కప్పం కడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. గురువారం స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని అడిగితే అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఆదోనికి మెడికల్ కళాశాల రెండో విడతలో మంజూరైందని, పనులు కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వ మారిందన్నారు. ఎమ్మెల్యేగా పనులు ఆపారో ప్రజలకు చెప్పకుండా గత ప్రభుత్వంపై అబద్ధం చెప్పడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో ప్రజలకు చెప్పాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, కౌన్సిలరులు ఫయాజ్, చలపతి, రామలింగేశ్వర యాదవ్, కామాక్షి నారాయణ, పెద్ద హరివనం సర్పంచ్ రాము పాల్గొన్నారు.

ముస్లింల పురోభివృద్ధికి జేఏసీ

ఆదోని టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ముస్లింల సమస్యల పురోభివృద్ధికి ఏఐఎంఐఎం పట్టణ ఇన్‌చార్జి జూనైద్ ఆధ్వర్యంలో జేఏసీ ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్, కో కన్వీనర్‌గా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాసిర్, సయ్యద్ వసీం ఖాద్రి, ఫారుక్, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు జిక్రియ, ఖాదర్, సీపీఐ నాయకులు ఇర్షాద్ న్యాయ సలహాదారులు సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- విద్యుత్ డీఈఈ సంతోష్ కుమార్



ఆలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తామని ఆలూరు సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్ ఆధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: రైతులకు ఇబ్బంది కలగకుండా సరఫరా చేస్తున్నారా?

జవాబు: ఆలూరు సబ్ డివిజన్ పరిధిలోని 5మండలాల్లో వ్యవసాయానికి అనుకూలమైన సమయాల్లో రోజుకు 9గంటలు అందిస్తున్నాం.

ప్రశ్న: లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించారా?

జవాబు: సమస్య ఉన్న ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: వ్యవసాయ కనెక్షన్లు ఇస్తున్నారా?.

జవాబు: దరఖాస్తుల వరుస క్రమాన్ని అనుసరించి ఇస్తున్నాం అందరూ కలిసి వస్తే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్థంబాలు కూడా వేయిస్తున్నాం.

ప్రశ్న: ప్రభుత్వ కార్యాల యాల విద్యుత్ బకాయిలు వసూలు చేస్తున్నారా?

జవాబు: ఆలూరు, ఆస్పరి, హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి, మండలాల్లో రూ.4కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ఇప్పటికే నోటీసులు ఇచ్చాము. గృహ వినియోగదారులకు గ్రామాలోనే బిల్లు వసూలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. మొండి బకాయిలుంటే కనెక్షన్ తొలగిస్తున్నాం.

ప్రశ్న: సిబ్బంది పనితీరుపై విమర్శలు న్నాయి?

జవాబు: సిబ్బంది పనితీరు పర్యవేక్షిస్తున్నాం. ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ ఇస్తున్నారా?

జవాబు: ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు వంద శాతం సబ్సిడీ వస్తుంది. 200యూనిట్లు దాటితే రూ. వెయ్యి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

శిథిలమైన ఆస్పత్రి భవనాలు

● ఏళ్లు గడుస్తున్నా పునర్నిర్మాణానికి నోచుకోని వైనం

● ఇబ్బందుల్లో వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించిన క్వాటర్స్ శిథిలావస్థకు చేరాయి. ఏళ్లు గడుస్తున్నా వీటిని పట్టించుకున్న నాథుడే లేడు. ఎమ్మిగనూరు పట్టణంలోని 1.20 లక్షల జనాభాతోపాటు పక్క నియోజకవర్గాలైన మంత్రాలయం, కోడుమూరులోని బెళగల్ మండలాల నుంచి వైద్య సేవల కోసం నిత్యం


పెచ్చులూడిపోయిన భవనం

ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఏ అత్యవసర చికిత్స అయినా ఆయా గ్రామాల నుంచి రోగులు రాత్రి, పగలు తేడా లేకుండా ఈ ప్రభుత్వ వైద్యశాలనే ఆశ్రయిస్తారు. అలాంటి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులో 24గంటల పాటు రోగులకు చికిత్సలు అందజేయాల్సి ఉంది. ఇందుకు వైద్యులు నిత్యం ఆస్పత్రిలో ఉన్న క్వాటర్స్‌లో ఉండాల్సి వస్తుంది. ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు 23మంది ఉండగా, వైద్య సిబ్బంది 98 మంది ఉన్నారు. అయితే ప్రభుత్వ వైద్యశాలలో గత కొన్నేళ్లుగా క్వాటర్స్ శిథిలమయ్యాయి. దీంతో ఆ భవనాల్లో వైద్యులుకాని, వైద్య సిబ్బందికాని నివాసం ఉండేందుకు అనువుగా లేకుండా పోయింది. దీంతో ఆ భవనాలు కాస్తా బూతు భవనాల్లా మారిపోయాయి. ఆస్పత్రికి సంబంధించిన పనికిరాని వస్తువులను అక్కడ పడేస్తున్నారు. అలాగే పర్యవేక్షణలేకపోవడంతో ముళ్లకంపలతో పాటు చెట్లు మొలకెత్తి ఏపుగా పెరిగిపోయాయి. ఆస్పత్రికి వచ్చిన వారు క్వాటర్స్‌లోనే మల, మూత్ర విసర్జన చేస్తుండడంతో క్వాటర్స్ కాస్తా దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక గోడలు సైతం నెర్రలిచ్చి నేడో రేపో పడిపోయే పరిస్థితికి చేరాయి. వైద్యుల క్వాటర్స్ పక్కనే ఉన్న నర్స్ క్వాటర్స్ సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరిపోయి క్వాటర్స్ చుట్టూ పెద్ద పెద్ద చెట్లు పెరిగి నివాసయోగ్యంగా లేకుండా పోయాయి.

ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయని వైనం

ఆస్పత్రి ఆవరణలో ఉన్న వైద్య సిబ్బంది క్వాటర్స్ మరమ్మతుల గురించిగాని నూతన భవన నిర్మాణాల గురించిగాని అధికారులు పట్టించుకున్న


ఆస్పత్రి ఆవరణలో శిథిలమైన వైద్యుల క్వాటర్స్

పాపానపోలేదు. దీంతో ఎంతో మందికి వైద్యసేవలందించే వైద్య సిబ్బంది నివాసం ఉండే క్వాటర్స్ శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. దీంతో వైద్య సిబ్బంది ఏళ్ల తరబడి ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలోనే కేటాయించిన ఏదో ఒక గదిలో ఉండి రోగులకు సేవలందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే క్వాటర్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనలు పంపాం

ఆస్పత్రి ఆవరణలో ఉన్న క్వాటర్స్ పునర్నిర్మాణానికి పది రోజుల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే క్వాటర్స్ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ సుధ, సూపరింటెండెంట్,
ప్రభుత్వ వైద్యశాల, ఎమ్మిగనూరు

ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదైన ఫిర్యాదులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మంత్రాలయం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమర్పించిన అర్జీలపై నిర్లక్ష్యం వహించవద్దని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. గురువారం రాత్రి మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన రికార్డులను, మ్యుటేషన్, భూమి కొలతలు, రీసర్వే జరిగిన అవకతవకలు వంటి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తమవి కానివి పరిధిలో తమకు పంపాలని అధికారులను ఆదేశించారు. గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలు, తహసీల్దార్లు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. రైతుల ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ ఎస్.రవి, డిప్యూటీ తహసీల్దార్లు జీకే గురురాజరావు, సరస్వతి, ఆర్‌ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, జయరామిరెడ్డి, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, శ్వేత, ప్రభాకర్, నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును తహసీల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 19 మంది రైతులు తమ అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, తహసీల్దార్ శేషఫణి మాట్లాడుతూ గ్రామంలోని రైతులు రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఈరన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


భరద్వాజశెట్టిని పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

కోసిగి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల భరద్వాజశెట్టిని గురువారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పరామర్శించారు. మూడు రోజుల క్రితం కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. దీంతో తిక్కారెడ్డి ఆసుపత్రికి వెళ్లి భరద్వాజశెట్టి ఆరోగ్య స్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పెండ్యాల రమేష్ శెట్టి, రవితేజ శెట్టి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

గోనెగండ్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అందుచేత ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ బ్యాంక్ వారు కూడా ఓటీపీలు అడగరని, తెలియని వ్యక్తులు అడిగితే చెప్పరాదని, ఎవరికీ షేర్ చేయరాదని, తెలియని లింక్‌లు క్లిక్ చేయరాదని సూచించారు. ఆన్‌లైన్‌లో డబ్బులు పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని మోసపోవద్దని, నకిలీ లోన్ యాప్‌లలో రుణాలు పొందరాదని అన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే 1930కి డయల్ చేయాలని కోరారు.

మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో యువతీ యువకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గంగిరెడ్డి మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గ్రీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్ రిపేరు చేసేవారికి నైపుణ్య అభివృద్ధి ఎస్ఎస్‌డీసీ వారి ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ప్లాటు ఫామ్ ద్వారా జీవనోపాధి కల్పిస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు డిసెంబరు 27వ తేదీ నుంచి 30 వరకు ఎమ్మిగనూరు పాత మున్సిపల్ ఆఫీసు, మెప్మా ఆఫీసులో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

ర్యాలీని జయప్రదం చేయండి

నందవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో చేపట్టే వైసీపీ ర్యాలీని జయప్రదం చేయాలని గురువారం వైసీపీ మండల పార్టీ కన్వీనర్ శివారెడ్డిగౌడు కోరారు. శుక్రవారం ఎమ్మిగనూరులోని పార్టీ కార్యాలయం నుంచి సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనగా విద్యుత్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తామని అన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మారికాంబదేవిని దర్శించుకున్న టీడీపీ నాయకులు

కౌతాళం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారంతో గ్రామ దేవర ఉత్సవాలు ముగిశాయి. మండల పరిధిలోని గ్రామంలో గ్రామ దేవత మారికాంబదేవిని గురువారం టీడీపీ తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి మండల టీడీపీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు.

ఘనంగా సీపీఐ శత జయంతి ఉత్సవాలు


ఎమ్మిగనూరు, కోసిగిలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో గురువారం సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం దగ్గర సీపీఐ జెండాను పార్టీ సీనియర్ నాయకులు నీలకంఠ ఎగురవేశారు. అనంతరం జూనియర్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ప్రముఖ వైద్యులు డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ శిల్పా, మనోజ్, డాక్టర్ రవూఫ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగాలకు మారుపేరు కమ్యూనిస్టు పార్టీలు అన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్నాయని కొనియాడారు. పోరాటాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. రక్తదాన శిబిరంలో 37 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని వైద్యులు అభినందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు సమీఉల్లా, దాదావలి, జబ్బార్, విజయేంద్ర, తిమ్మగురుడు, వీరేష్, రాజీవ్, శ్రీరాములు, నరసింహులు పాల్గొన్నారు.

కోసిగి: సీపీఐ శత జయంతి వేడుకలు కోసిగి మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. సీపీఐ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, సీపీఐ నాయకులు ఓంకార్ స్వామి, ప్రకాష్, బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్న, తాలుకా కార్యదర్శి రాజు, వీరేష్, జీవన్ తదితరులు ఉన్నారు.

మంత్రాలయం: ప్రజల సంక్షేమం, సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నది సీపీఐ అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ అన్నారు. గురువారం మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో సీపీఐ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, వీరేష్, రాఘవేంద్ర, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలో గురువారం మండల పార్టీ కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో సీపీఐ శతజయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో తాలుకా నాయకులు శాంతప్ప, ముని, విజయ్, తిమ్మప్ప, నరసప్ప, రాముడు, నాగన్న పాల్గొన్నారు.

పెద్దకడుబూరు : పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ అని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ నాయుడులు అన్నారు. గురువారం సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెద్దకడుబూరులో సీపీఐ జెండాను ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్ పటేల్, మహ్మద్, దస్తగిరి, రమేష్, తిక్కన్న, అనుమంతు, రంగన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం


పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, మాధవరం పోలీసులు

మంత్రాలయం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని కర్నూలు ఎక్సైజ్ అండ్ టాస్క్‌ఫోర్సు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమార్‌లు ధ్వంసం చేయించారు. గురువారం సాయంత్రం మాధవరం చెక్‌పోస్టు సమీపంలో 9 కేసుల్లో పట్టుబడిన 41 మద్యం బాక్సుల్లో 3,936 టెట్రా ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కించారు. వీటి విలువ దాదాపు రూ.1.57 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చెక్‌పోస్టు ఎక్సైజ్ సీఐ, హెడ్ కానిస్టేబుల్ వీరేష్, వీరాంజనేయులు, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కోల్‌మాన్ పేట జట్టు


విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌మాన్ పేట గ్రామంలో శ్రీమారెమ్మ దేవి దేవర సందర్భంగా నిర్వహించిన డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంటులో కోల్‌మాన్‌పేట జట్టు విజేతగా నిలిచింది. గురువారం కామన్‌దొడ్డి, కోల్‌మన్‌పేట జట్లు ఫైనల్‌లో తడబడగా.. హోరాహోరీ ఫైనల్‌లో కోల్‌మన్‌పేట క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంటుకు ముఖ్యఅతిథిగా టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, టీడీపీ యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్ పాల్గొన్నారు. విజేతగా నిలిచిన కోల్‌మాన్‌పేట జట్టుకు స్పాన్సర్ ఉప్పలపాటి అర్జున్ నగదు బహుమతి రూ.20వేలు అందజేశారు. రన్నర్‌గా కామన్‌దొడ్డి జట్టుకు స్పాన్సర్ మండల కన్వీనర్ జ్ఞానేష్ రూ.15 వేల నగదును అందజేశారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి


ఆధార్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో 0-6 సంవత్సరాల పిల్లలకు సంబంధిత అంగనవాడీ కేంద్రాల్లోనే ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మండల పరిధిలోని హల్వి గ్రామంలో గురువారం ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను ఆయా అంగనవాడీ కేంద్రాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి అంగనవాడీ సిబ్బంది తమ పరిధిలోని 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ తీయించాలని ఆదేశించారు. అనంతరం ఆధార్ ప్రక్రియను పరిశీలించారు. వీరి వెంట ఈఓపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ కరీం, సర్పంచ్ క్రాంతి ఉన్నారు.

ఏఐవైఎఫ్ మండల కమిటీ ఎన్నిక

కోసిగి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నూతన మండల కమిటీని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడిగా పి.చిన్న, ఉపాధ్యక్షులుగా కృష్ణ, అంజి, ప్రకాష్, రమేష్, మండల ప్రధాన కార్యదర్శి ఎ.జీవన్, సహాయ కార్యదర్శులుగా హనుమంతు, వీరేష్, మహేష్, సుధాకర్‌బాబుతో పాటు మరో 15 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న, ప్రతాప్, వీరేష్ ఉన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): యువకులకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం కల్గుతుందని టీడీపీ బీవీ యూత్ నాయకులు వలీ అన్నారు. గురువారం మాచాపురం గ్రామంలో కబడ్డీ పోటీలకు 10 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.2000, రెండో బహుమతిగా రూ.1000 ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నబిసాబ్, రంజాన్, దేవసాయం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

గోనెగండ్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని మండల టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్ అన్నారు. పుట్టపాశం గ్రామంలో గురువారం ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఆరు నెలల్లోపే గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరాచారి, జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు బడేసా, బీటీ చిన్నహనుమంతు, బీటీ శ్రీనివాసులు, సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్ట్ (అప్కాస్) కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, పెన్షన్‌లు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీపీఎం తాలుకా కార్యదర్శి రాముడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు, కేశన్న మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేరుస్తామని చెప్పి పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా డిమాండ్ల వినతి పత్రం కమిషనర్ గంగిరెడ్డికి ఇచ్చారు. కార్యక్రమంలో ఇమ్మానుయేల్, బడెసాబ్, రామాంజనేయులు, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో బీటీ రోడ్డు

● ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు

● సెంటర్ లైటింగ్, డివైడర్ల ఏర్పాటు

ఎమ్మిగనూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు పట్టణంలోని రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారి పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన విషయం తెలిసిందే. గుంతలు, గతుకుల రోడ్లలో నరకయాతన అనుభవిస్తూ ప్రయాణాలు సాగిస్తూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నెలల వ్యవధిలోనే పట్టణంలోని పలు రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. అంతేగాక పట్టణంలోని ప్రధాన రహదారులకు రూ. కోట్లతో బీటీ రోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రూ.కోటి రుపాయలతో పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ నుంచి పైమాల గేరిలోని బడేసాహెబ్ దర్గా వరకు రోడ్డు విస్తరణతో పాటు కమిటీ వరకు బీటీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజులుగా శ్రీనివాస సర్కిల్‌లో ఆస్పత్రి వైపు మట్టిని తొలగించి కంకర పనులను పూర్తి చేయడంతోపాటు బడేసాహెబ్ దర్గా దగ్గర మట్టిని తొలగించే పనులను మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఓవైపు రోలింగ్ పనులు జరుగుతుండగా మరోవైపు మట్టి తొలగించే పనులు వేగంగా సాగుతున్నాయి. ఎమ్మిగనూరు జాతరలోపు పనులు పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు ముమ్మరంగా పనులు చేస్తున్నారు. ఇప్పటికే రూ.7లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయగా రహదారి వెడల్పు పనులు పూర్తయిన వెంటనే రహదారి మధ్యలో రూ.2 లక్షలతో డివైడర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తయిన వెంటనే కొత్తగా బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. వారం రోజులుగా రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో పట్టణ రహదారులకు పూర్వ వైభవం వస్తోందని ప్రజలు, పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ జాతరలోపు అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.


రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మట్టిని తొలగిస్తున్న కూలీలు

గృహ నిర్మాణాల పరిశీలన


గుడికల్లులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో జరుగుతున్న గృహ నిర్మాణాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీలోపు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈఈ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.